# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- సమర్థ నీటి నిర్వహణ ద్వారా ఎల్ నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు కృషి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.

- పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు.

- మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు తెలిపారు.

- అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కూరుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

ఆదివాసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గిరిజన విద్యార్థులు బాగా చదువుకొని ఐఐటీలకు వెళ్లాలని.. తద్వారా దేశానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ దేశం కోసం పని చేయాలని, దేశం మనకు ఏమిచ్చిందనే దానికంటే.. మనం దేశానికి ఏమిస్తున్నామనే ఆలోచన ఉండాలని సూచించారు. ఆదివాసీలకు చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, థింసా నృత్యం గిన్నిస్ రికార్డులోకి ఎక్కడం గర్వకారణమన్నారు. అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తామని వెల్లడించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 డిసెంబర్ నాటికి గిరిజనులందరికీ ఇళ్లు, సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

==========================

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన ఘటనపై అధికారులతో హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు విశాఖపట్నంలో సమీక్షించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్, ప్రియాంక తండ్రి వెంకటేష్ తో ఫోన్ లో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆమె తండ్రికి భరోసా ఇచ్చారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేశారని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి స్పష్టం చేశారు.

==========================

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో చేపట్టిన `హరిత వనం` కార్యక్రమాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంతరించిపోతున్న వృక్ష జాతులను సంరక్షించి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు.

==========================

`జన్ - మన్` పథకం ద్వారా గిరిజనులకు రహదారులు, జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు `ప్రపంచ ఆదివాసీ దినోత్సవ` వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశం కోసం, స్వాభిమానం కోసం ఎంతో మంది ఆదివాసి నాయకులు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. విజయనగరంలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... గిరిజనులకు ఉద్యోగాలను కల్పించేందుకుగాను జీవో నెం. 3ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. గిరిజనుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించి, వారికి ఆ పథకాలు అందించేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు.

విరామం

==========================

సమర్థ నీటి నిర్వహణ ద్వారా ఎల్ నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు కృషి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ ను ముఖ్యమంత్రి ఈరోజు పరిశీలించారు. పట్టి సీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని ఆయన తిలకించారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్ లో ఇప్పటి వరకు 17.52 టిఎంసిల నీటిని కృష్ణా నదికి తరలించినట్లు అధికారులు వివరించారు. పట్టి సీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి దిగువన కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాబావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

==========================

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం `నషా ముక్త్ భారత్ అభియాన్` కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నషా ముక్త్ భారత్ అభియాన్ గోడపత్రికను ఆయన ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ... 100 వారాల పాటు కొనసాగే దేశవ్యాప్త ప్రచారంలో యువత, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు భాగస్వామ్యం కావాలన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

===========================

భావితరాలకు స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలియజేయాలసిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. `హర్ ఘర్ తిరంగా` యాత్రను గుంటూరులో మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భావితరాల బాగు కోసం పోరాటం చేసిన మహనీయులను స్మరించు కోవటం ముఖ్యమన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జీడీపీ కలిగి ఉందంటే అందుకు గత 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బలమైన నాయకత్వమే ప్రధాన కారణమని పేర్కొన్నారు.

===========================

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఛత్తీస్‌గఢ్‌పై కేంద్రీకృతమై ఉందని, ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రలో రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందన్నారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించారు.

===========================

===========================